RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 337 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం ఆదివారం, 9 జూన్ 2024 పేజీలు : 4 వెల : 2/-




# త్వరలో క్యాబినెట్ విస్తరణ

## అంతకంటే ముందే పీసీసీ చీఫ్ నియామకం

## నామినేటెడ్ పోస్టులు కూడా భర్తీ

## వివిధ సమీకరణాల ఆధారంగా పదవులు

## హైకమాండ్‌తో చర్చించేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని కాంగ్రెస్ లో జోరుగా ప్రచారం జరుగుతున్నది. కొత్త పీసీసీ చీఫ్ నియామకం, నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా ఉంటుందని తెలుస్తున్నది. మంత్రివర్గంలో మరో ఆరుగురికి చోటు కల్పించే అవకాశముంది. ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని జిల్లాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు నేతల సీనియారిటీ, సామాజిక సమీకరణాలు, ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా కేబినెట్ బెర్త్‌లను భర్తీ చేసే చాన్స్ ఉంది. ఈ అంశాలపై పార్టీ హైకమాండ్ తో చర్చించి, గ్రీన్ సిగ్నల్ తీసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. సీడబ్ల్యూసీ మీటింగ్‌లోనూ ఆయన పాల్గొన్నారు.. కాగా, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కొత్తగా ఎన్నికైన పార్టీ ఎంపీలకు శనివారం డిన్నర్ ఏర్పాటు చేశారు. ఇందులో సీఎం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది ఎంపీలు పాల్గొన్నారు.

**ముందు నామినేటెడ్ పోస్టులు..** పీసీసీ చీఫ్ నియామకం, మంత్రివర్గ విస్తరణ కంటే ముందు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. 54 కార్పొరేషన్లకు చైర్మన్ల లిస్టు ఇప్పటికే సిద్ధమైంది. దానికి పార్టీ హైకమాండ్ ఆమోదించిన తర్వాత ప్రకటించనున్నారు. లోక్ సభ ఎన్నికలకు ముందు 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. కానీ వాటిపై పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సీఎం?కు ఫిర్యాదు చేశారు. దీంతో వాటిల్లో పలు మార్పుచేర్పులు చేసిన సీఎం.. ఈ జాబితాకు తోడు మిగిలిన 17 కార్పొరేషన్లకు చైర్మన్ల పేర్లతో పాటు మెంబర్లను కూడా ఖరారు చేశారు. సీఎం రేవంత్ ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే కార్పొరేషన్ల చైర్మన్లను ప్రకటించనున్నారు. ఈ క్రమంలో పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు రేవంత్ ను కలిసి తమకు మంత్రి పదవి ఇవ్వని పక్షంలో కనీసం కీలకమైన కార్పొరేషన్‌చైర్మన్ పదవి అయినా ఇవ్వాలని కోరుతున్నారు.

**సీఎం టూర్ తర్వాతే క్లారిటీ..** సీఎం రేవంత్ ఢిల్లీ టూర్ తర్వాతే కేబినెట్‌విస్తరణపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్ర కేబినెట్ లో మొత్తం 18 మందికి అవకాశం ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంది మంత్రులు ఉన్నారు. అంటే మంత్రివర్గంలో మరో ఆరుగురికి అవకాశం ఉంది. వీటి భర్తీలో ఇప్పటి వరకు కేబినెట్ లో ప్రాతినిధ్యం లేని జిల్లాలను, ఎమ్మెల్యేల సీనియారిటీని, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకునే చాన్స్ ఉంది. అదే సమయంలో ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు మంచి మెజార్టీ తెప్పించిన ఎమ్మెల్యేల పనితీరును ప్రామాణికంగా తీసుకోవచ్చు. మరోవైపు బీఆర్ఎస్ నుంచి త్వరలోనే కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారని ప్రచారం జరుగుతున్నది. చేరేవాళ్ల స్థాయిని బట్టి ఒకరిద్దరికి మంత్రి పదవులు ఇస్తారనే చర్చ సాగుతున్నది. ఇక ఇప్పటివరకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని ఉమ్మడి జిల్లాల్లో ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ ఉన్నాయి. హైదరాబాద్ పరిధిలో కంటోన్మెంట్ ఉప ఎన్నికలో శ్రీగణేశ్ ఇటీవల గెలిచారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. ఆయన మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఇక రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో మల్‌రెడ్డి రంగారెడ్డి( ఇబ్రహీంపట్నం), మనోహర్ రెడ్డి ( తాండూర్), రామ్మోహన్ రెడ్డి (పరిగి) ఉన్నారు. వీరిలో మల్ రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లాలో బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి పేరు బాగా ప్రచారంలో ఉంది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో పాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంత్రి పదవులు ఆశిస్తున్నారు.

**పీసీసీ చీఫ్ పోస్టు ఎవరికి దక్కెనో?** పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి మూడేండ్ల పదవీకాలం ఈ నెల 27తో పూర్తి కానుంది. దీంతో కొత్త పీసీసీ చీఫ్ ను నియమించనున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ పదవిని భర్తీ చేయనున్నారు. పీసీసీ చీఫ్ పోస్టు కోసం పార్టీలో పోటీ ఎక్కువే ఉంది. ఈ నేపథ్యంలో అది ఎవరికి దక్కుతుందోనని అందరిలో ఆసక్తి నెలకొంది.




**కేంద్రంలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం జూన్ చివరివారంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అందులో రాష్ట్రానికి వచ్చే గ్రాంట్లు, నిధులు పరిశీలించే అవకాశం ఉంది. ఆ తర్వాతే పూర్తిస్థాయి బడ్జెట్ ను రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. జులై రెండు లేదా మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టాలనే యోచనలో రేవంత్ ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో కేటాయింపులు పక్కాగా ఉండాలని ఇప్పటికే అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు.**



## కాంగ్రెస్ లోక్‌సభ ఫ్లోర్ లీడర్‌గా రాహుల్ గాంధీ

కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని ఆ పార్టీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్‌గా బాధ్యతలు చేపట్టాలని సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. శనివారం నాడు ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ అయ్యింది. సుమారు మూడు గంటల పాటు ఈ సమావేశం సాగింది. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. సిడబ్ల్యూసీ సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై, ఎన్నికల ఫలితాలపై చర్చించామన్నారు. సీబీఐ, ఈడీ సంస్థలతో కాంగ్రెస్ నేతలను బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని చెప్పారు. కాంగ్రెస్ పని అయిపోయిందని చాలా మంది కామెంట్స్ చేశారని.. ఎగ్జిట్ పోల్స్‌పై పోరాటం చేశామని కేసీ వేణుగోపాల్ చెప్పుకొచ్చారు.




లోక్ సభ ఎన్నికల్లో ఊహించిన దానికంటే ఎక్కువ స్థానాలను గెలుచుకుంది ఇండియా కూటమి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో అయితే అత్యధిక స్థానాలను గెలుచుకుని బీజేపీకి బిగ్ షాక్ ఇచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని 80 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేసి ఆరింటిని గెలుచుకోగా, సమాజ్‌వాదీ పార్టీ 37 స్థానాను గెలుచుకుంది. బీజేపీ 33 స్థానాలకు పరిమితమైంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తరప్రదేశ్‌లో జూన్ 11 నుండి 15 వరకు రాష్ట్రంలోని మొత్తం 403 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ధన్యవాద యాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అవినాష్ పాండే తెలిపారు. ఈ యాత్రలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. యాత్రలో వివిధ వర్గాల ప్రజలకు రాజ్యాంగ ప్రతిని ఇచ్చి సత్కరించనున్నారు. ఉత్తరప్రదేశ్ లో అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలు, 403 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

# మోదీ ప్రమాణానికి సర్వం సిద్ధం

## చకా... చకా... ఏర్పాట్లు!




న్యూఢిల్లీ : మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార ముహూర్తం ఖరారైంది. ఆదివారం రాత్రి 7-15 గంటలకు ప్రధానమంత్రి, ఇతర మంత్రి మండలి సభ్యులతో రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయిస్తారని రాష్ట్రపతి భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అంతకు ముందు మోదీని ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకున్నామని, ఆయనను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతూ కూటమికి చెందిన నేతలందరూ రాష్ట్రపతి ముర్మును కలిసి సంయుక్త లేఖను సమర్పించారు. ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీలన్నీ మోదీని ప్రధానిగా సమర్థిస్తూ వేర్వేరు లేఖలను కూడా రాష్ట్రపతికి అందజేశాయి. ఇదిలా ఉండగా, రాష్ట్రపతి అభ్యర్థన మేరకు ప్రధాని మోదీ తన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి తేదీ సమయాన్ని సూచించారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఢిల్లీని 9, 10 తేదీల్లో నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. రాష్ట్రపతితో భేటీ తర్వాత బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తన నివాసంలో మిత్రపక్షాల నేతలతో వేర్వేరుగా చర్చలు జరిపారు. చంద్రబాబు, నితీశ్ కుమార్, ఏక్‌నాథ్ షిండే, పవన్ కల్యాణ్, చిరాగ్ పశ్వాన్, జయంత్ చౌదరి, అనుప్రియ పాటిల్, అజిత్ పవార్‌లు నడ్డాతో చర్చలు జరిపారు.

ఈ సమావేశంలో అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొన్నారు. తెలుగుదేశం, జనతాదళ్(యు)లకు రెండు కేబినెట్, రెండు సహాయ మంత్రి పదవులు ఇచ్చేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. శివసేన, లోక్ జనశక్తిలకు ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవి చొప్పున ఇచ్చే అవకాశాలున్నాయి. జనతాదళ్(ఎస్), జనసేన, ఆర్ఎల్‌డీలకు ఒక కేబినెట్ కానీ, స్వతంత్ర హోదాలో ఒక సహాయమంత్రి పదవి కానీ కేటాయించవచ్చు. అప్నాదళ్‌లకు ఒక సహాయ మంత్రి కేటాయించే అవకాశాలున్నాయి.

**మంత్రివర్గ విస్తరణలో వీరికి ప్రాధాన్యం లభించవచ్చు...** NDA ప్రభుత్వంలో నితీష్ కుమార్ పార్టీ JDU, చంద్రబాబు నాయుడు పార్టీ TDP ప్రధాన పాత్ర పోషించబోతున్నాయి. అందుకే ఈ రెండు పార్టీలకు కేంద్ర మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇవ్వవచ్చు. పశ్చిమ యూపీలో ఆర్ఎల్‌డీకి బీజేపీ 2 సీట్లు ఇవ్వగా, ఆ రెండు స్థానాల్లో విజయం సాధించింది. ఈ కారణంగానే జయంత్ మంత్రివర్గ విస్తరణలో జయంత్ చౌదరికి కూడా చోటు కల్పించవచ్చు.

**మహారాష్ట్ర బీజేపీ మిత్రపక్షాలు ఈ డిమాండ్‌ను ముందుకు తెచ్చాయి...** మహారాష్ట్రలోని బీజేపీ మిత్రపక్షాలన్నీ మంత్రివర్గ విస్తరణకు సంబంధించి తమ డిమాండ్లను ముందుకు తెచ్చినట్లు సమాచారం. మూలాధారాలను విశ్వసిస్తే.. షిండే వర్గానికి చెందిన శివసేన 2 కేబినెట్ మంత్రులు, 2 రాష్ట్ర మంత్రులను డిమాండ్ చేయగా, అజిత్ పవార్ వర్గానికి చెందిన NCP 1 కేబినెట్ మంత్రి, 1 రాష్ట్ర మంత్రిని డిమాండ్ చేసింది. రాందాస్ అథవాలే రాష్ట్ర మంత్రిని డిమాండ్ చేశారు.

**ప్రధానిగా నరేంద్ర మోదీ ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేస్తారు..?...** ఇదిలా ఉండగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎన్డీయే అధినేత నరేంద్ర మోదీని ప్రధానిగా నియమించారు. వార్తా సంస్థ ANI నివేదిక ప్రకారం.. 09 జూన్ 2024న సాయంత్రం 07:15 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రి మండలి సభ్యులతో పదవీ ప్రమాణం, గోప్యత ప్రమాణం చేయిస్తారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## రాజీవ్ గాంధీ చేసినట్టు మోదీ చేస్తారా?

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 292 స్థానాలకే పరిమితమైన సంగతి తెలిసిందే. 400 స్థానాలను లక్ష్యంగా పెట్టుకున్నా సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఈ పరాజయానికి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని పదవిని చేపట్ట కూడదని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఇండియా కూటమిలోని పలువురు నేతలు ఈ డిమాండ్ వినిపించగా ఇప్పుడు రాజస్థాన్ కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ ఇదే అంశాన్ని లేవనెత్తారు. 1989లో నాడు ప్రధానిగా ఉన్న రాజీవ్ గాంధీ సైతం ఆ ఎన్నికల్లో మెజార్టీ కంటే తక్కువ సీట్లు వచ్చాయని.. ప్రధాని పదవిని చేపట్టడానికి ఇష్టపడలేదని సచిన్ పైలట్ గుర్తు చేశారు. 1989 లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 197 స్థానాలు వచ్చాయి. నాడు లోక్ సభలో ఆ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే ప్రజలు తమకు పూర్తి మెజార్టీ ఇవ్వలేదని.. ప్రధాని పదవిని చేపట్టడం సరికాదని రాజీవ్ గాంధీ భావించారు. దీంతో 143 స్థానాలు సాధించిన జనతాదళ్ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జనతాదళ్ కు టీడీపీ సహా పలు పార్టీలు నాడు మద్దతు ఇచ్చాయి. అయితే ఈ ప్రభుత్వం రెండేళ్లకే కుప్పకూలింది. 1991లో కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఇదే అంశాన్ని సచిన్ పైలట్ గుర్తు చేశారు. నాడు ఎన్నికల్లో పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీవ్ గాంధీ ప్రధాని పదవికి దూరంగా ఉన్నట్టే.. ఇప్పుడు నరేంద్ర మోదీ కూడా ప్రధాని పదవిని చేపట్టకూడదని సచిన్ పైలట్ డిమాండ్ చేశారు. ప్రస్తుత ఫలితాల విషయంలో బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సచిన్ పైలట్ కోరారు. 1989లో కాంగ్రెస్ పెద్ద పార్టీగా అవతరించినా పూర్తి మెజార్టీ రాలేదని రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో కాంగ్రెస్ తర్వాత పెద్ద పార్టీగా నిలిచిన జనతాదళ్ కు అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. తాజా ఎన్నికల్లో బీజేపీకి కూడా నాడు కాంగ్రెస్ కు ఎదురైన పరిస్థితే ఎదురయిందని సచిన్ పైలట్ చెప్పారు. కాబట్టి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా ఉండాలన్నారు. ప్రస్తుత ఎన్నికల ఫలితాలు బీజేపీకి, ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. కాగా ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా 240 ఎంపీ స్థానాలు వచ్చాయి. ఎన్డీయే భాగస్వామ్య పార్టీలతో కలిసి బీజేపీ మొత్తం 292 స్థానాలు గెలుచుకుంది. దీంతో మెజార్టీ (272) కంటే అధికంగా 20 స్థానాలు ఎన్డీయే కూటమికి ఉన్నా యి. దీంతో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. మరోవైపు బీజేపీ తర్వాత అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ ఉంది. ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో 99 స్థానాలు దక్కాయి. ఒక ఇండిపెండెంట్ ఎంపీ కూడా కాంగ్రెస్ లో చేరడంతో 100 స్థానాలు దక్కినట్టయింది. ఇక కాంగ్రెస్ పార్టీ తన మిత్ర పక్షాలతో కలుపుకుని 240 సీట్లు సాధించింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ నేతలు బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొద్దని కోరుతున్నారు. అయితే మరోసారి ప్రధాని మోదీని ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు తమ నాయకుడిగా ఎన్నుకున్నాయి. జూన్ 9న ఆయన మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీంతో ఇండియా కూటమి ఆశలకు తెరపడ్డట్టే!

## రామోజీరావు స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తాం: చంద్రబాబు



హైదరాబాద్: తెలుగు జాతికి గొప్ప స్ఫూర్తిని ఇచ్చిన వ్యక్తి రామోజీరావు అని తెదేపా అధినేత చంద్రబాబు కొనియాడారు. రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "రామోజీరావు మృతి చాలా బాధాకరం. ఒక యుగపురుషుడు చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం. అనునిత్యం సమాజహితం కోసం, తెలుగుజాతి కోసం పనిచేశారు. ఒక పల్లెటూరులో సాధారణ కుటుంబంలో పుట్టి.. అసాధారణ వ్యక్తిగా ఎదిగారు. ఆయన వ్యక్తి కాదు .. ఒక వ్యవస్థ. మార్గదర్శితో ప్రారంభించి ఆ తర్వాత ఈనాడు, ఈటీవీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు స్థాపించారు. నిద్రలేస్తే ఈనాడు పత్రిక చదివితే తప్ప ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. ఆ విధంగా ప్రజల్ని చైతన్యవంతుల్ని, విజ్ఞానవంతుల్ని చేసేందుకు అనునిత్యం సాధన చేశారు. 40 ఏళ్లుగా నాకు ఆయనతో పరిచయం ఉంది. నాతో ఒక్కటే చెప్పే వారు మీరు ఏం చెప్పినా .. నేను మాత్రం ధర్మం ప్రకారమే పనిచేస్తాను, విధి నిర్వహణలో ఎల్లప్పుడూ ప్రజాపక్షానే ఉంటానని స్పష్టంగా చెప్పేవారు. ఆయన చనిపోయే వరకు ఒకటే కోరిక.. అనునిత్యం పనిచేస్తూ.. పనిలో చనిపోతేనే ఆనందంగా ఉంటుందనేవారు. బ్రతికున్నంతవరకు ప్రతి నిమిషం ప్రజలకోసమే పనిచేస్తూ ఉండాలని చెప్పిన వ్యక్తి రామోజీరావుగారు. ఆయన నిర్మించిన వ్యవస్థలు ఈనాడు, ఈటీవీ శాశ్వతం. వీటితో పాటు చిత్రపరిశ్రమకు ఎనలేని సేవలందించారు. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో రామోజీ ఫిల్మ్‌సిటీ నిర్మించారు. నా వల్ల ఈ సిటీకి, రాష్ట్రానికి ఆదాయం రావాలని చెప్పేవారు. తెలుగు జాతి వెలుగు.. తెలుగుజాతి గుండెల్లో చిరస్థాయిగా ఉండే వ్యక్తి. అలాంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధనిపిస్తోంది. ఎంతో విశ్వసనీయత కలగిన వ్యక్తి రామోజీరావు. నాకు క్లిష్టమైన సమస్యలు వచ్చినప్పుడు ఎంతో ధైర్యం చెప్పే వారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆయన ధర్మం పక్షానే ఉండి పనిచేశారు. ప్రజలకు కూడా ఆయనపై అచంచలమైన విశ్వాసం. అందుకు కారణం జీవితాంతం ఆయన సంపాదించిన విశ్వసనీయత. అలాంటి వ్యక్తిని పోగొట్టుకోవడం బాధేస్తోంది. ప్రతి ఒక్కరూ రామోజీరావును ఆరాధిస్తారు. ఆయన చెప్పిన విషయాలు ఎప్పుడూ నా చెవుల్లో రింగుమంటూనే ఉంటాయి. రామోజీరావుగారు ఇచ్చిన స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

## రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించిన పవన్ కల్యాణ్



హైదరాబాద్: రామోజీగ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు పార్థివదేహానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణ (చినబాబు) నివాళులర్పించారు. అనంతరం రామోజీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "రామోజీరావు మరణ వార్త చాలా దిగ్భ్రాంతి కలిగించింది. ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చి ఆయన్ను కలుద్దామనుకున్నా. కానీ, ఇంతలోనే దురదృష్టవశాత్తూ కన్నుమూశారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వేలాది మంది జర్నలిస్టులు ఈనాడు జర్నలిజం స్కూల్ నుంచి వచ్చిన వారే. ఎంతో మంది జర్నలిస్టులను అందించిన మహానుభావులు ఆయన. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో చేశారు. అత్యున్నత ప్రమాణాలతో గొప్ప ఫిల్మ్‌సిటీని నిర్మించారు. ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు అండగా ఉండాలి. జనసేన తరఫున సంతాపం తెలియజేస్తున్నా" అని పవన్ కల్యాణ్ అన్నారు.




ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు (88) కన్నుమూశారు. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ సహా రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామోజీరావుతో తమకున్న బంధాన్ని గుర్తుచేసుకుంటూ సామాజిక మాధ్యమాల వేదికగా నివాళులర్పించారు. మీడియా, సినీ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

**దూరదృష్టితో సమాజంలో రామోజీ చెరగని ముద్ర: రాష్ట్రపతి**
"రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. ఈనాడు వార్తా పత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను స్థాపించి ఎంతో మందికి మార్గదర్శకుడిగా నిలిచిన సృజనాత్మక వ్యాపారవేత్త ఆయన. తన దూరదృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంలో చెరగని ముద్ర వేశారు. పద్మవిభూషణ్ సత్కారం అందుకున్నారు. మీడియా, సినీ పరిశ్రమలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి"

**ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించేవారు: మోదీ** "రామోజీరావు మరణం ఎంతో బాధాకరం. భారతీయ మీడియాలో విప్లవాత్మక వార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు ఆయన. ఆయన సేవలు సినీ, పత్రికారంగాలలో చెరగని ముద్ర వేశాయి. తన అవిరళ కృషి ద్వారా.. మీడియా, వినోద ప్రపంచాల్లో శ్రేష్ఠమైన ఆవిష్కరణలకు నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఆయన ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించేవారు. ఆయనతో సంభాషించేందుకు, ఆయన నుంచి అపారమైన జ్ఞానాన్ని పొందేందుకు అవకాశం రావడం నా అదృష్టం. ఈ విచారకర సమయంలో రామోజీ కుటుంబసభ్యులు, స్నేహితులు, అసంఖ్యాక అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

**రామోజీరావు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిది: సీఎం రేవంత్ రెడ్డి**
"తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన వ్యక్తి రామోజీరావు. మీడియా రంగానికి ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నా" – తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి


"భారత మీడియా రంగంలో అగ్రగామి, పద్మవిభూషణ్ రామోజీరావు మరణం విచారకరం. జర్నలిజం, సినిమా, వినోద రంగానికి ఆయన అందించిన సేవలు చెరగని ముద్ర వేశాయి. మీడియా రూపురేఖలను మార్చాయి. ఈ విచారకర సమయంలో ఆయన కుటుంబం, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"

## రామోజీరావు వ్యక్తి కాదు.. శక్తిమంతమైన వ్యవస్థ: వెంకయ్యనాయుడు



హైదరాబాద్: రామోజీరావు స్వయంకృషి తో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియా డారు. రామోజీ పార్థివదేహానికి వెంకయ్యనాయుడు నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్య లకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "ఒక అఖండ తెలుగు జ్యోతి ఆరిపోయింది. రామోజీరావు వ్యక్తి కాదు. శక్తిమంతమైన వ్యవస్థ. స్వయంకృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించారు. ఒక ధ్రువతారలా నిరంతరం వెలుగుతూ ఉంటారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు భవిష్యత్తు తరాలకు ఆదర్శం. రామోజీరావు ఒక పోరాట యోధుడు" అని వెంకయ్యనాయుడు కొనియాడారు.

## రామోజీరావు మృతికి సంతాపం తెలిపిన రాజ్‌నాథ్‌సింగ్, మల్లికార్జున ఖర్గే



హైదరాబాద్: రామోజీరావు మృతి పట్ల భాజపా, కాంగ్రెస్ అగ్రనేతలు రాజ్‌నాథ్‌సింగ్, మల్లికార్జున ఖర్గే సంతాపం ప్రకటించారు. రామోజీరావు మరణం మీడియా, సినీ రంగానికి తీరని లోటని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. మీడియా, చలనచిత్రాల రంగాల్లో ఆయన తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పాత్రికేయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. సినీ నిర్మాతగా, మీడియా సంస్థల అధినేతగా, విద్యావేత్తగా రామోజీరావు అనేక సేవలు అందించారని, ఆయన మరణం విచారకరమన్నారు. మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దూరదృష్టి గల వ్యక్తి రామోజీరావు అని అన్నారు. సినిమా, పాత్రికేయ రంగానికి విశేష కృషి చేశారని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ఖర్గే ప్రకటించారు. మరోవైపు అధికారిక లాంఛనాలతో రామోజీ అంత్యక్రియలను నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీడబ్ల్యూసీ సమావేశాలకు దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ్నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు పర్యవేక్షించాల్సిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ద్వారా ఆదేశాలు పంపించారు.

## కరవులోనూ నీరు మెండుగా..

ముదిగొండ : నీటిని మనం రక్షిస్తే అది మనల్ని కాపాడుతుందన్న సత్యాన్ని గుర్తించారు. ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించారు. గ్రామంలో సామాజిక ఇంకుడుగుంతలు తీశారు. వర్షం నీరు, వాడకం నీటిని వృథాగా పోనీయకుండా నేలలో ఇంకేలా చేయడంతో భూగర్భజలాలు పెరిగాయి. గ్రామంలో మురుగు కనుమరుగై పారిశుధ్య సమస్యలు తొలగాయి. నేడు మండువేసవిలోనూ చేతిపంపులు, బోర్లలో సమృద్ధిగా నీరుంది. దీన్ని అధికారులు గుర్తించి వాటర్ సఫీషియంట్ పంచాయతీ(డబ్ల్యూఎస్‌పీ) విభాగంలో జిల్లా ఉత్తమ పంచాయతీగా ప్రతిపాదన పంపారు. ఇదీ ముదిగొండ మండలం పమ్మి గ్రామం ఘనత.

**పమ్మిలో ఇంటింటా ఇంకుడు గుంత నిర్మాణం**

గ్రామంలో ఇళ్లల్లో వాడకం నీటితో పాటు, వర్షపు నీరు గతంలో వృథాగా పోయేవి. నేడు గ్రామంలో ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టడంతో భూగర్భజలాలు పెరగటంతోపాటు పారిశుధ్యం మెరుగుపడింది. గ్రామంలో 2,077మంది జనాభా ఉండగా 639 ఇళ్లు ఉన్నాయి. వర్షపునీరును వృథాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకించడానికి, భూగర్భజలాలు పెరగటానికి ప్రతి ఇంటా



ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టాలని మండల అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో సమావేశాలు నిర్వహించారు. స్థానిక ప్రజలను చైతన్యపరిచారు. దీంతో వాటి ప్రాధాన్యం గుర్తించిన గ్రామస్థులు ప్రతి ఇంటా నిర్మాణాలు చేపట్టారు. వానాకాలంలో వర్షపునీరు వీధులు, ఖాళీ ప్రదేశాల్లోకి వృథాగా బయటకు పోకుండా చూశారు. కాలువల చివరన సామాజిక ఇంకుడుగుంతలు నిర్మించారు. చేతిపంపుల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేయించారు. దీంతో వృథా నీరంతా ఆయా గుంతల్లోకి నిరంతరం చేరుతోంది. ఫలితంగా వేసవిలోనూ బోర్ల నుంచి నీరు సమృద్ధిగా వస్తోంది. ప్రస్తుతం గ్రామంలో తాగునీటి ఇబ్బంది లేకుండా ఉంది. ఇళ్లలో వాడిన నీటితోపాటు వర్షపునీటిని ఇంకుడు గుంతలోకి మళ్లించేలా చూడటంలో పంచాయతీ వారు, అధికారులు సఫలీకృతులయ్యారు. దీంతో భూగర్భజలాలు పెరిగాయి. ప్రతి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయి. గ్రామంలో పారిశుధ్యం సైతం మెరుగుపడింది.

## మళ్లీ.. పోడు లొల్లి!

ఆసిఫాబాద్ : ఈ నెల 1న కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ శివారు సర్వే నం.145లో పోడు భూముల సర్వేకు వెళ్లిన అటవీ, రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకొని నిరసన తెలిపారు. గతంలోనే ఈ భూములను సర్వే చేశారని, మళ్లీ ఎందుకు చేస్తున్నారంటూ నిలదీశారు.

రెబ్బెన మండలం తుంగెడలో గత నెల 10న పాత పట్టాలు కలిగిన రైతులు.. భూముల్లో పొదలు తొలగిస్తున్న క్రమంలో అధికారులు అడ్డుకున్నారు. ఇది ఇరువర్గాల మధ్య తోపులాటకు దారితీసింది. పరస్పరం కేసులు నమోదయ్యాయి.

జిల్లాలో పోడు లొల్లి మళ్లీ మొదలైంది. వానకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో అటవీ అధికారులు మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం గొడవలకు దారితీస్తోంది. ఇటీవల ఆసిఫాబాద్ మండలం దానాపూర్, కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ శివారులో భూముల పరిశీలనకు వెళ్లిన అటవీ అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఈసారి పోడు భూముల్లో ఒక్క ఎకరం తీసుకున్నా రైతులతో కలిసి తిరుగుబాటు చేస్తామని ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఇప్పటికే హెచ్చరించిన నేపథ్యంలో.. అంతటా ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లాలో గిరిజనులతోపాటు గిరిజనేతరులు చాలా మంది అటవీ భూములు సాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం అటవీ హక్కు పత్రాలు జారీ చేస్తామని దరఖాస్తులు కోరింది. గిరిజనులు, గిరిజనేతరులు మొత్తం 31,633 మంది 1.19 లక్షల ఎకరాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో గిరిజనదారులు 15,577 మంది 62,478 ఎకరాల కోసం, గిరిజనేతరులు 16,056 మంది 57,362 ఎకరాలకు పట్టాల కోసం దరఖాస్తులు చేశారు. క్షేత్రస్థాయిలో ఎఫ్ఆర్‌సీ కమిటీలు సర్వే చేసి వివరాలను అంతర్జాలంలో నమోదు చేశారు. తదనంతరం ప్రభుత్వం గిరిజనేతరులవి పక్కనబెట్టి.. గిరిజనులవి మాత్రమే పరిశీలించింది. వీరిలో సుమారు 12,400 మందికి సుమారు 35వేల ఎకరాలకు సంబంధించి పట్టాలు జారీఅయ్యాయి.

**ప్రతి రేంజ్ నుంచి 200–300 ఎకరాలు..**

పోడు సాగు చేసుకుంటూ హక్కు పత్రాలు లేని వారి నుంచి కొంతమేర స్వాధీనం చేసుకునేందుకు అటవీ శాఖ పావులు కదుపుతున్నట్లు సమాచారం. జిల్లాలో 11 రేంజ్‌లు ఉన్నాయి. ఒక్కో రేంజ్ నుంచి 200–300 ఎకరాలను స్వాధీనం చేసుకొని మొక్కలు నాటేలా మౌఖికంగా ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిసింది. ఆ దిశగా ముందుకు వెళ్లే క్రమంలో గత నెల 31న దానాపూర్‌లో పోడు భూముల పరిశీలనకు వెళ్లినట్లు తెలిసింది. గతంలో అక్కడ పదెకరాల వరకు స్వాధీనం చేసుకొని మొక్కలు నాటారు. ఈ సారి అక్కడ 50 ఎకరాలు స్వాధీనం చేసుకునే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. అయితే గ్రామస్థులంతా మూకుమ్మడిగా అధికారులను అడ్డుకున్నారు.

**ఆందోళనలో అన్నదాతలు..** ఇప్పటికే కొందరు భూములు దున్ని విత్తనాలు విత్తేందుకు సన్నద్ధమవు తున్నారు. ఇలాంటి సమయంలో అధికారులు తమ భూములని, సర్వే చేసి మొక్కలు నాటేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టడంతో.. పోడు రైతుల్లో ఆందోళన మొదలైంది. పోడు భూముల్లో నాగళ్లతోనే దున్నాలని, ట్రాక్టర్లతో వద్దని ఆదేశాలివ్వడంపై కూడా వారు ఆవేదన చెందుతున్నారు.

**గిరిజనేతరుల నుంచి సేకరిస్తాం..**
**నీరజ్‌కుమార్ టిబ్రెవాల్, జిల్లా అటవీ అధికారి**

ఎలాంటి హక్కు పత్రాలు లేకుండా అటవీ భూములు ఆక్రమించి కొందరు సాగు చేస్తున్నారు. గిరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలిచ్చింది. గిరిజనేతరులకు ఇవ్వలేదు. అలాంటి వారి నుంచి కొంతమేర స్వాధీనం చేసుకొని మొక్కలు నాటాలని భావిస్తున్నాం. దానాపూర్ గ్రామస్థులు అడ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నష్టపరిహారం పొందారు. మళ్లీ ఇక్కడ ఆక్రమించి సాగు చేస్తున్నారు. అవి వైల్డ్ లైఫ్ పరిధిలో ఉన్నాయి. పరిశీలించేందుకు వెళితే అడ్డుకోవడం సరికాదు.

# వికసిత్ భాజపా



హైదరాబాద్ : నగరమే పునాదిగా ఎదిగిన భాజపా గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఎంతో ప్రగతి సాధించింది. నగర పరిధిలోని ఎంపీ స్థానాలు మూడుంటే అప్పట్లో ఒక్క స్థానాన్ని మాత్రమే కైవసం చేసుకుంది. మిగతా స్థానాల్లో రెండో స్థానంలో కూడా లేని భాజపా ఈసారి ఏకంగా మూడు స్థానాలను కైవసం చేసుకుంది. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా భాజపా గట్టి పోటీ ఇచ్చింది. అక్కడ ప్రచార ఉద్ధృతి కనిపించింది. పాతబస్తీలో కేంద్ర హోంమంత్రి రోడ్డు షో నిర్వహించారు. ప్రధానమంత్రితో పాటు.. కేంద్రమంత్రులు, ఎంపీలు, జాతీయ నాయకులు పాతబస్తీలో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. ఇలా నగరంలో భాజపా ఈసారి తనదైన ముద్ర వేసింది. ఇంకా చెప్పాలంటే.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పటాన్‌చెరు నియోజకవర్గం భాగమైన మెదక్‌లో కూడా భాజపా విజయం సాధించింది. గత పార్లమెంటు ఎన్నికల తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రెండో అతి పెద్ద పార్టీగా ఎదిగి ఏకంగా 48 డివిజన్లలో విజయం సాధించింది.

**మూడో స్థానానికి పరిమితమైన భారాస**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 18 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని తిరుగులేని శక్తిగా ఉన్న భారాస లోక్‌సభ ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైంది. గత ఎన్నికలతో పోలిస్తే నగరంలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ వెనుకబడింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో 35.23 శాతం ఓట్లు సాధించగా.. ఈ సారి 12.37 శాతానికి పడిపోయింది. హైదరాబాద్ నియోజకవర్గంలో 7.3 శాతం నుంచి ఈసారి 1.73 శాతానికి ఆ పార్టీ సాధించిన ఓట్లు పడిపోయాయి. మల్కాజిగిరిలో 38 శాతం నుంచి 15.6 శాతానికి పరిమితమైంది. చేవెళ్లలో 40.62 శాతం ఓట్లతో విజయం సాధించిన భారాస ఈసారి ఎన్నికల్లో 10.73 శాతం ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**కాంగ్రెస్ పెరుగుదల కొద్దిగా..**

రాజధాని పరిధిలో ఒక్క అసెంబ్లీ స్థానాన్ని కూడా సాధించని కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి ఓట్ల శాతాన్ని కొంతమేర పెంచుకుంది. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంలో గత ఎన్నికల్లో 19 శాతం ఓట్లు రాగా.. ఈసారి 40 శాతం ఓట్లు పెంచుకోగలిగింది. మల్కాజిగిరిలో గతంలో 39 శాతం ఓట్లు సాధించి.. అక్కడ రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. ఈసారి అక్కడ 31 శాతం ఓట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. హైదరాబాద్, చేవెళ్ల నియోజకవర్గాల్లో ఓట్ల శాతం స్వల్పంగా పెరిగింది. హైదరాబాద్‌లో 5.7 శాతం నుంచి 5.83 శాతానికి ఓట్లు పెరగగా.. చేవెళ్లలో గతంలో 39.5 శాతం నుంచి 38.08కి పరిమితమైంది.

# నిఘా నిద్దరోతోంది!

నల్గొండ : జిల్లా పరిధిలోని జాతీయ రహదారితో పాటు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి వెంట ఇటీవల పగలు, రాత్రి తేడా లేకుండా నేరాలు పెరిగిపోతున్నాయి. పోలీసు బందోబస్తు సక్రమంగా లేకపోవడంతో రహదారులనే అడ్డాగా మలచుకుని నేరస్థులు పేట్రేగిపోతున్నారు. వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నా.. ఉన్నతాధికారులు సరైన చర్యలు చేపట్టడంలేదు. శనివారం రాత్రి నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం వద్ద కనగల్ మండలం బచ్చగూడెం గ్రామానికి చెందిన యల్లేశ్ అనే లారీ ఓనర్‌తో పాటు డ్రైవర్‌ను గుర్తు తెలియని ఇద్దరు మహిళలు టార్చ్‌లైట్ వేసి ఆపారు. ఆ తరువాత మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి కాళ్లూచేతులు కట్టేసి చితకబాదడంతో పాటు రూ.22వేలు ఎత్తుకెళ్లడం పోలీసుల పనితీరుకు సవాల్‌గా మారింది. గత నెల 18న కట్టంగూరు మండల కేంద్రంలో డీసీఎం ఓనర్ కొల్లూరి రాజవర్ధన్(35)ను కాళ్లూచేతులు కట్టేసి హత్యచేసి లోదుస్తులపైనే వదిలి వెళ్లిన ప్రాంతానికి కూతవేటు దూరంలోనే ఈ సంఘటన జరిగింది. కనీసం హత్య జరిగిన నాటి నుంచైనా పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించినట్లయితే రెండో సంఘటన జరిగివుండేది కాదని స్థానికులు వాపోతున్నారు.

**కొద్ది రోజులుగా..**

చౌటుప్పల్ నుంచి కోదాడ వరకు జాతీయ రహదారిపై ఇటీవల వరస



ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. డీజిల్ దొంగతనాలు, వ్యభిచారం, రాబరీ, హిజ్రాల వేధింపుల, లారీటఫల్ (వస్తువులు ఎతుకెళ్లడం) నుంచి డబ్బుల కోసం హత్యలు చేసే స్థాయి వరకు నేరాలు పెరుగుతున్నాయి. గత పది రోజులుగా నల్గొండ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఘటనలు వాహనదారులతో పాటు పగలు రాత్రి ఒంటరిగా రోడ్డు వెంట వెళ్లాలనే వారిలో ఆందోళన కలిగిస్తున్నాయి.

నాలుగు రోజుల క్రితం నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై నల్గొండకు వస్తున్న క్రమంలో నార్కట్‌పల్లి వద్ద ఇద్దరు దుండగులు అతని ద్విచక్ర వాహనం ఆపి చితక బాదారు. అతడి వద్ద ఉన్న రూ.2,500 ఎత్తుకెళ్లారు. అతడు రెండు రోజుల పాటు నల్గొండ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

నెల రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు ఆర్టీసీ బస్సులో వస్తున్న ఓ మహిళను నార్కట్‌పల్లి బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పరిచయం చేసుకుని నల్గొండకు వచ్చే మధ్యలో ఎనమిది తులాల బంగారం గొలుసు ఎత్తుకెళ్లారు. బాధితులు నల్గొండలో ఫిర్యాదు చేశారు. ఆరు నెలల క్రితం నార్కట్‌పల్లి శివారులో ఉన్న ఓ హోటల్ వద్ద ఆగిఉన్న బస్సులో ప్రయాణికుడి నుంచి కిలో బంగారం ఎత్తుకెళ్లారు. ఈ ఘటన కంటే కొద్ది రోజుల ముందు మరో వ్యక్తి వద్ద రూ.50 లక్షలు ఎత్తుకెళ్లారు. ఇప్పటి ఈ హోటల్ ప్రాంతంలోనే నాలుగు సంఘటనలు జరిగాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందినా ఎలాంటి చర్యలు లేవు.

**పెట్రోలింగ్ పెంచుతాము: శివరాంరెడ్డి, డీఎస్పీ, నల్గొండ**

జాతీయ రహదారితో పాటు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇటీవల పగలు రాత్రి పెట్రోలింగ్ పెంచాము. ఫిర్యాదు చేసిన ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. ఇటీవల జరుగుతున్న ఘటనలకు సంబంధించిన నేరస్థులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాస్తవాలు వెలుగులోకి తీసుకొస్తాం.


# అతివకు చేయూత..!

నల్గొండ : మహిళా సంఘాల ఆర్థిక బలోపేతంపై మెప్మా ప్రత్యేక దృష్టి సారించింది. గత ఏడాది పురపాలికల పరిధిలో శత శాతానికిపైగా రుణ లక్ష్యాలను అధిగమించాయి. అదే ఉత్సాహంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రుణాలు మంజూరు చేసేందుకు మెప్మా యంత్రాంగం పురపాలికల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఒక్కో సంఘానికి సీనియారిటి పరిగణనలోకి తీసుకుని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు మెప్మా యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. నల్గొండ జిల్లాలోని అన్ని పురపాలికల్లో 817 పొదుపు సంఘాలకు రూ.58.8 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించాయి.

నల్గొండ జిల్లాలో ఎనిమిది పురపాలికల పరిధిలో మహిళలు ఆహార శుద్ధికేంద్రాలు, కుటీర పరిశ్రమలతో పాటు చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి వారికి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పొదుపు చేసుకునే మహిళలు ఒక సంఘంగా ఏర్పాటు చేసి ఆర్థిక చేయూతనందిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వడ్డీలేని రుణాలు మంజూరు చేసేందుకు ఇటీవలే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిపోనుండటంతో వారం పది రోజుల్లో ప్రభుత్వ ఆమోదం పొందే అవకాశం ఉంది. పట్టణాల్లో పొదుపు సంఘాలను మూడు రకాలుగా విభజించారు. దివ్యాంగులు, మహిళా సంఘాలతో పాటు, కొత్తగా వీధి వ్యాపారం నిర్వహించే మహిళలతో ప్రత్యేకంగా పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారు.

జిల్లాలోని పురపాలికల్లో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణాల మంజూరు పరిశీలిస్తే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని దాటేశారు. జిల్లాలోని ఎనిమిది పురపాలికల పరిధిలో 798 సంఘాలకు రూ.50.37 కోట్లు మంజూరు చేయాలనే లక్ష్యానికి 958 పొదుపు సంఘాల మహిళలకు రూ.99.27 కోట్లు రుణాలు మంజూరు చేశారు. అధిక రుణాలతో మహిళలు ఆర్థిక ప్రగతి పథంలో ముందడుగు వేయడంతో ప్రతి ఏటా కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తూ వారికి ఆర్థికంగా బాటలు పరుస్తున్నారు.

# ఆరు నెలల్లోనే.. అనూహ్య మార్పు



రాయదుర్గం : జిల్లా రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఇందుకు సాక్ష్యం తాజా పార్లమెంట్ ఫలితాలు. గత ఏడాది డిసెంబరు 3న జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారాస 4, కాంగ్రెస్ 3 (వికారాబాద్, తాండూరు, పరిగి) స్థానాల్లో విజయం సాధించాయి. కొడంగల్‌లో కాంగ్రెస్ గెలిచినా మహబూబ్‌నగర్ ఎంపీ పరిధిలో ఉంది. ఎంపీ ఫలితాలు తారుమారు కావడం అనూహ్య పరిణామంగా నిలిచింది.

**ప్రకటనకు ముందునుంచే భాజపా వ్యూహం**

గత అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వలేక మూడో స్థానానికే పరిమితమై చతికిల పడిన భాజపా పార్లమెంటు ఎన్నికలు వచ్చే సరికి పడి లేచిన కెరటంలా ఎగిసింది. జిల్లాలోని 97 పురపాలక వార్డుల్లో పట్టుమని పది మంది కౌన్సిలర్లు కూడా లేరు. నాలుగున్నర నెలల స్వల్ప వ్యవధిలోనే భాజపా అనూహ్యంగా పుంజుకొని చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని 1,72,897 ఓట్ల భారీ మెజార్టీతో కైవసం చేసుకొని కాషాయ జెండాను రెపరెపలాడించింది. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాక మునుపే భాజపా తన అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఖరారు చేసింది. దీంతో ఆయన నియోజక వర్గమంతా విస్తృతంగా పర్యటించి మద్దతు కూడగట్టుకోవడం బాగా కలిసి వచ్చింది.

**గెలుపు నమ్మకం కొనసాగుతుందని ఆశించిన కాంగ్రెస్**

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పూర్తిగా హస్తం హవా నడిచింది. ఇదే పంథా పార్లమెంట్ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని పార్టీ అధినేతలు భావించారు. దీనికి అనుగుణంగా నామపత్రాల ప్రక్రియ ముగింపు దశలో భారాస సిట్టింగ్ ఎంపీ, మరోమారు చేవెళ్ల అభ్యర్థిగా ప్రకటించిన గడ్డం రంజిత్‌రెడ్డిని పార్టీలో చేర్చుకొని కాంగ్రెస్ తన అభ్యర్థిగా ప్రకటించింది. ఇది కాంగ్రెస్‌లోని ఓ వర్గానికి, భారాసకు కంటగింపుగా మారింది. పార్టీకి నమ్మక ద్రోహం చేసిన రంజిత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని స్వయానా కేసీఆర్ చేవెళ్ల బహిరంగ సభలో విమర్శించడంతో ప్రజల్లోకి బలంగా వెళ్లింది. దీంతో 2023 శాసనసభ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం నుంచి 12,682 ఓట్ల మెజార్టీ వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎన్నికల్లో 7,569 మెజార్టీకే పరిమితం చేసింది. కాంగ్రెస్ అంతర్గత అసంతృప్తి ఎంపీ ఎన్నికల్లో పరాజయానికి ఓ కారణంగా నిలిచింది.

**వరుస విజయాల నుంచి పరాజయం వైపు..**

భారాస 2014, 2019 ఎన్నికల్లో వరుస విజయాలు నమోదు చేసుకున్నా 2024లో జరిగిన ఎన్నికల్లో మాత్రం పరాభావాన్ని మూటగట్టుకుంది. భాజపా, కాంగ్రెస్ పార్టీని ఢీకొట్టలేక మూడో స్థానంలోకి వెళ్లి పోయింది.

2023 నవంబరు 30న జరిగిన శాసన సభ ఎన్నికలకు సంబంధించి డిసెంబరు3న ఓట్ల లెక్కింపు జరిగింది. అప్పట్లో తాండూరు, వికారాబాద్, పరిగి నియోజక వర్గాల్లో కలిపి భారాస 2,26,408 ఓట్లను సాధించింది. తాండూరులో 78,079, పరిగిలో 74,523, వికారాబాద్‌లో 73,806 చొప్పున ఓట్లను సాధించింది. అయితే ఆరు నెలల్లోనే వచ్చిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాలను వెనక్కి నెట్టి మెజార్టీ ఓట్లను సాధించాలని పార్టీ భావించింది. తీరా ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే సరికి 47,617 భారాస ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భాజపాకు పోటీగా నిలవ లేక పోయిందని తేట తెల్లమైంది. ఈ ఎన్నికల్లో భారాస మూడు శాసన సభ నియోజక వర్గాల్లో కలిపి కేవలం 47,617 ఓట్లను మాత్రమే సాధించింది. శాసన సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోల్చి చూస్తే 1,78,791 ఓట్లను నిలబెట్టుకోలేకపోయింది. ఓటు బ్యాంకును కోల్పోయింది.

ఎన్నికలు జరగడానికి రెండు రోజుల ముందు నుంచే పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు స్తబ్దుగా ఉండి పోయారు. దీంతో పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లు అనూహ్యంగా భాజపాకు బదిలీ అయ్యాయి.

# సర్కారు స్థలం కబ్జాకు యత్నాలు

రాయదుర్గం : ఖాజాగూడ సర్వే నంబరు 40లోని సర్కారు జాగాను కబళించేందుకు యత్నాలు జరుగుతున్నాయి. అక్కడ ఆక్రమణ దారులు దాదాపు ఎకరం స్థలం కబళించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని విలువ రూ.60 కోట్ల వరకు ధర పలుకుతోంది. సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకుని మరీ ఆ స్థలానికి కాపలా ఉంచారు. ఎకరా వరకు కబళించే యత్నాలు.. ఖాజాగూడ సర్వే నం.40 పూర్తిగా ప్రభుత్వ స్థలం. ఆ జాగాను కబళించేందుకు ఆక్రమణదారులు నానా విధాల యత్నిస్తున్నారు. ఇప్పటికే నకిలీ దస్తావేజులు సృష్టించి ఎకరాల కొద్దీ స్థలాన్ని కొందరు ఆక్రమించి భవనాలు నిర్మించారు. ఖాళీగా మిగిలి ఉన్న స్థలాన్ని పరిరక్షించడంలో అధికారులు విఫలం కావడంతో కబ్జాదారుల కన్ను పడింది. అక్కడి ఖాజాగూడ చెరువు గండిమైసమ్మ దేవాలయం ఎదురుగా ఎకరాకుపైగా జాగా ఉంది. ఆ స్థలంపై ఆక్రమణ దారుల కన్నుపడింది. ఎలాగైనా సొంతం చేసుకోవాలని స్థలానికి కంచె నిర్మించేందుకు గుంతలు తవ్వారు. తర్వాత ఇనుప రాడ్డులు నాటి ఇనుప కంచె నిర్మించాలని అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఆ స్థలానికి సెక్యూరిటీ గార్డులను కాపలా పెట్టి అక్కడికి ఎవరూ రాకుండా చూస్తున్నారు.

ఆ ప్రదేశం ఖాజాగూడ చెరువు కట్ట పక్కన.. ఎత్తైన ప్రదేశంలో పచ్చదనం, ప్రకృతి అందాలతో అలరారుతుంటుంది. దాని పక్కనే ఐటీ భవనాలూ ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ ఎకరా స్థలం రూ.60కోట్లకుపైగా పలుకుతుంది. విలువైన స్థల సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టడంలేదు. కొన్నాళ్లుగా కబ్జా యత్నాలు సాగుతున్నా.. ఆ స్థలం చెంత కనీసం ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డులూ ఏర్పాటు



చేయలేదు. ః అదే స్థలం సమీపంలో ఓ భవనానికి ఆనుకుని ఉన్న సర్వే నం.40లోనే 200 గజాలకుపైగా కబళించి ప్రహరీ, గదులు నిర్మించారు. నకిలీ దస్తావేజులతో.. సర్వే నం.40లో ఎకరాల కొద్దీ స్థలం ఆక్రమణ దారుల చేతుల్లోకి చేరి పెద్దపెద్ద బహుళ అంతస్తుల భవనాలు పుట్టుకొచ్చాయి. వాటిపై అధికారులు ఎలాంటి విచారణ, చర్యలు చేపట్టకుండా వదిలేశారు. నకిలీ దస్తావేజులు సృష్టించి కబ్జాలు చేసి విక్రయించారు. ప్రస్తుతం గండిమైసమ్మ దేవాలయం వద్దా అవే ప్రయత్నాలు సాగుతున్నాయి.

**పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం**

సర్వే నం.40లో సర్కారు జాగా ఆక్రమణల నుంచి పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి డిప్యూటీ తహసీల్దార్ శంకర్ కు తెలిపారు. కబ్జాలను నిరోధిస్తామని స్పష్టం చేశారు.

# మృతపరీక్ష.. ఓ శిక్ష

కోదాడ : రోదిస్తూ మృతుల శవపరీక్ష కోసం ఎదురుచూస్తున్న ఈ చిత్రం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలోనిది. ఏప్రిల్ 25న తెల్లవారుజామున కోదాడ పట్టణ పరిధిలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతులందరి పంచనామా, శవపరీక్ష పూర్తయ్యే సరికి సాయంత్రం నాలుగైంది. అంటే 12 గంటల సమయం పట్టింది. మృతుల్లో ఖమ్మం జిల్లాకు చెందిన వారు ఉండటంతో స్వస్థలానికి తీసుకెళ్లేసరికి రాత్రయింది. చీకట్లోనే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చిందని, గ్రామస్థులు, బంధువులు కూడా మృతదేహాన్ని చూడలేని పరిస్థితి ఏర్పడిందని కుటుంబీకులు వాపోయారు. ఈ ఏడాది మే 2న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి కోదాడ బస్టాండ్‌లో ఎండ వేడికి తట్టుకోలేక మృతి చెందాడు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఘటన జరిగితే పంచనామా, పోస్టుమార్టం పూర్తయ్యేసరికి మరుసటి రోజు మధ్యాహ్నం 12:30 గంటలు అయింది. కోదాడ నుంచి మృతుడిని సొంతూరుకు తరలించే సరికి రాత్రి 7 గంటలు దాటింది. బంధువుల సందర్శనార్థం గంట సేపు మాత్రమే ఉంచి చీకట్లోనే అంత్యక్రియలు పూర్తి చేశారు. శవపరీక్ష కోసం సుమారు 20 గంటలు ఎదురు చూడాల్సి వచ్చిందని మృతుడి బంధువు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. అనుకోని ప్రమాదం ఎదురై మనిషి ప్రాణం పోతే ఆ కుటుంబ సభ్యుల బాధను వర్ణించలేం. ఆ బాధలోనూ వారు మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లడంలో పోస్టుమార్టం పేరిట విపరీత జాప్యం జరుగుతోంది. దీంతో ఇంటి దగ్గర నిర్వహించాల్సిన కార్యక్రమాలు ఆలస్యమవుతున్నాయి. పోస్టుమార్టం చేయాలంటూ పోలీసులు



మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తారు. పంచనామా పత్రం ఉంటేనే పోస్టుమార్టం చేస్తామని వైద్యులు చెబుతుంటారు. పంచనామా ఆలస్యం కావడంతో గంటల తరబడి ఆస్పత్రిలోనే మృతదేహాలను ఉంచుతున్నారు.

**ఉదయం పదైతేనే పంచనామా..**

పంచనామా చేసే సిబ్బంది ఉదయం పది గంటలకు విధులకు హాజరై పంచనామా మొదలు పెడుతున్నారు. ఒక వ్యక్తికి పంచనామా చేయాలంటే రెండు నుంచి నాలుగు గంటల వరకు సమయం పడుతోంది. శవపరీక్షకు మరో 30 నిమిషాలు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల సమయంలో మాత్రమే పంచనామా రాస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సాయంత్రం 5 గంటల తర్వాత మరణించిన వారికి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు పంచనామా రాయడం ఏంటనీ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరణించిన వెంటనే పంచనామా రాసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**త్వరగా పూర్తి చేసేలా చర్యలు: రాహుల్ హెగ్డే, జిల్లా ఎస్పీ, సూర్యాపేట**

మృతదేహాలకు పంచనామా పేరిట ఆలస్యం అవుతుందని మా దృష్టికి వచ్చింది. త్వరగా పంచనామా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రమాదం జరిగిన వెంటనే, అవసరమైతే ఆ సమయంలో అదనపు సిబ్బందితో సత్వరమే పంచనామా పూర్తి చేసేలా చర్యలు చేపడతాం.

# బిందు సేద్యం.. రాయితీ గగనం

ఖమ్మం : ఉద్యాన పంటలకు 'బిందు సేద్యం'(డ్రిప్ ఇరిగేషన్) పరికరాలు అందకపోవటంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక మంది ఆయిల్‌పాం, మిరప, కూరగాయలు తదితర పంటలకు డ్రిప్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయిల్‌పాంలో మొదటి సంవత్సరం వారికి పథకం మంజూరు చేసినప్పటికీ ఇంకా కొంతమంది రైతులు మిగిలే ఉన్నారు. నాలుగు సంవత్సరాల వరకు పంటను పండించే అనేక మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఐదారు నెలలు గడుస్తున్నా ఇంతవరకు స్పందన లేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. రైతులు జిల్లా ఉద్యానశాఖ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కోడ్ ఉన్నందున ఇప్పుడు తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారు.

**ఆయిల్‌పాం రైతులకు తీవ్ర ఇబ్బంది**



ఆయిల్‌పాం తోటలకు బిందు సేద్యం పరికరాలు అందకపోవటంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తోటల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం రైతులను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే రాయితీ పథకాలు అమలుచేస్తోంది. ఆయిల్‌పాం తోటలు సాగు చేసే రైతులకు రాయితీపై బిందు సేద్యం పరికరాలను అందిస్తోంది. కొన్ని నెలల నుంచి ఈ పరికరాలు అందకపోవటంతో మొక్కలకు నీటిని సరఫరా చేయటం కష్టంగా మారింది. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా వీటికి నీరు ఎంతో అవసరం. చాలామంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. హెక్టారుకు రూ.55,250 విలువ గల మొక్కలు, ఎరువులు, అంతర పంటలు, డ్రిప్ పరికరాలను సర్కారు ఇస్తుంటుంది.

**ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పరిశీలిస్తాం**

దరఖాస్తులు పెండింగులో ఉన్న విషయం వాస్తవమే. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దరఖాస్తులను పరిశీలించి రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహకరిస్తాం.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
ఆదివారం 9 జూన్ 2024



# ఎవరికీ తలవంచని మేరుపర్వతం దివికేగింది

హైదరాబాద్: ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు(88) మృతి పట్ల సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ.. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

**రామోజీరావు నా జీవితంలో గొప్ప ప్రేరణ, మార్గదర్శకులు** "నా గురువు, శ్రేయోభిలాషి రామోజీరావు మరణవార్త నన్ను ఎంతగానో బాధించింది. జర్నలిజం, సినిమా రంగాల్లో ఆయన చరిత్ర సృష్టించారు. రాజకీయాల్లో ఆయన కింగ్ మేకర్"– రజనీకాంత్

**ఎవరికీ తలవంచని మేరు పర్వతం** "ఎవరికీ తలవంచని మేరు పర్వతం దివికేగింది. 'ఓం శాంతి'. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి"–చిరంజీవి

**తెలుగు పత్రికా రంగంలో మకుటం లేని మహారాజు** "తెలుగు పత్రికా రంగంలో మకుటం లేని మహారాజు రామోజీరావు. తెలుగు నుడికారానికి ఒక కొత్త కళను తెచ్చారు. జర్నలిజానికి కొత్త సొబగును దిద్దారు. చిత్ర సీమలో అదే తీరున సాగి ఉషోదయ కిరణాలను ప్రసరింపజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడియోగా రామోజీ ఫిల్మ్ సిటీని తెలుగు నేలపై నెలకొల్పారు. ఏది చేసినా తనదైన బాణీ కల్పిస్తూ సాగిన రామోజీరావు ఇక లేరు అన్న వార్త ఆవేదన కలిగిస్తోంది. మా తండ్రి నందమూరి తారక రామారావు గారితో ఆయన అనుబంధం ప్రత్యేకమైనది"–బాలకృష్ణ

**నూటికో కోటికో ఒకరు** "మీడియా సామ్రాజ్యాధినేత రామోజీరావు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిది. ఆయన మన మధ్య ఇకలేరు అనే వార్త బాధాకరం. 'నిన్ను చూడాలని'తో నన్ను తెలుగు సినిమా పరిశ్రమకి పరిచయం చేసినప్పటి జ్ఞాపకాలు ఎప్పటికీ మరువలేను. ఆ మహనీయుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి"– ఎన్టీఆర్

**ఎంతో ముందు చూపు ఉన్న గొప్ప వ్యక్తి..** "ఎంతో ముందు చూపు ఉన్న గొప్ప వ్యక్తి రామోజీరావు. ఆయన మృతి ఎంతో బాధ కలిగిస్తోంది. సినిమాపై ఆయనకున్న అభిరుచికి రామోజీ ఫిల్మ్ సిటీ ఓ నిదర్శనం. ఆయన మనందరికీ స్ఫూర్తి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబానికి సానుభూతి తెలియచేస్తున్నాను"– మహేశ్ బాబు

**జర్నలిజం రంగం దశదిశను మార్చారు** "రామోజీరావు మరణం తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభతిని తెలుపుతున్నా. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలి"–రవితేజ

**ఆయన సేవలు మరువలేనివి** "నేను గౌరవించే స్ఫూర్తిదాయక వ్యక్తుల్లో ఆయన ఒకరు. మీడియా, సినిమా, ఇతర రంగాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివి. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"–అల్లు అర్జున్

**రామోజీకి భారతరత్న సముచిత గౌరవం** "ఒక మనిషి అనేక రంగాల్లో వివిధ సంస్థలు స్థాపించి వాటిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు. ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచారు. మరెంతో మందికి ఉపాధి కల్పించారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వడమే సముచితమని రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా"– దర్శకుడు రాజమౌళి

**తెలుగువారి చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది** "రామోజీ రావు మృతితో తెలుగువారి చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. నన్ను అత్యంత ప్రేమించిన వ్యక్తి రామోజీరావు"– రాజేంద్రప్రసాద్

**ఆయనతో మాట్లాడితే ఎంతో ఎనర్జీ వచ్చేది** "శ్రీవారికి ప్రేమలేఖ' నుంచి ఆయనతో నా అనుబంధం ప్రారంభమైంది. 40ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం. నాకు మానసికంగా నాలుగు స్తంభాలు.. అమ్మ, కృష్ణగారు, జంధ్యాలగారు, రామోజీరావుగారు. నాకు ఎనర్జీ కావాలనుకున్నప్పుడు ఆయనతో మాట్లాడితే ఎక్కడలేని శక్తి వచ్చేది. ప్రపంచ సినిమా ఇక్కడకు తీసుకురావాలని రామోజీ ఫిల్మ్‌సిటీ నిర్మించారు. ఇండియాలో యూనివర్సల్ స్టూడియో నిర్మించిన గొప్ప వ్యక్తి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వాళ్ల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" – సినీ నటుడు నరేష్

**నాలాంటి ఎంతో మంది నటులను పరిచయం చేశారు** "తొలి చూపులోనే' సినిమాతోనే నా సినీ ప్రస్థానం మొదలైంది. నాలాగే ఎంతో మంది సినీతారలకు అవకాశం ఇచ్చారు. టెలివిజన్‌లోనూ రచయితలు, నటులను పరిచయం చేశారు. ఈనాడు, ఈటీవీల ద్వారా నమ్మకమైన వార్తలను అందించిన వ్యక్తి. సినిమా ఇండస్ట్రీకి రామోజీ ఫిల్మ్ సిటీ గొప్ప ఆస్తి. ఏ షూటింగ్ అయినా సులభంగా ఇక్కడ జరిగిపోతుంది. ఆయన మరణం కలచివేస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నా"–నందమూరి కల్యాణ్‌రామ్

**ఎంతో మందికి జీవితాలను ఇచ్చారు** "రామోజీ ఫిల్మ్ సిటీని వరల్డ్ నెం.1 చేయాలన్నది ఆయన కోరిక. ఎన్నో సంస్థలతో ఎంతో మందికి జీవితాలను ఇచ్చారు. నేను ఎప్పుడు వచ్చినా ఆప్యాయంగా పలకరించే వారు. మహోన్నత వ్యక్తి రామోజీరావుగారు"– మురళీ మోహన్

**మహోన్నత వ్యక్తిని కోల్పోయాం** "నేనెప్పుడూ చెబుతూ ఉంటా. అలెగ్జాండర్ ది గ్రేట్.. రామోజీ ది గ్రేట్. ఎంతో మందికి ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి. నేను, రాజ్ ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్‌లో చిత్రాలకు పనిచేశాం. 'నువ్వే కావాలి' చిత్రానికి సోలోగా అవకాశం ఇచ్చారు. సిల్వర్ జూబ్లీ ఫంక్షన్ రోజున నన్ను ఎంతో మెచ్చుకుని ఆశీర్వదించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా" – సంగీత దర్శకుడు కోటి

**రామోజీరావు నాకు స్ఫూర్తి** "రామోజీరావు నాకు ఎంతో స్ఫూర్తి. సొంత వ్యక్తిత్వంతోనే జీవించాలన్నది ఆయనను చూసే నేర్చుకున్నా. ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు ఆయన నుంచే నేర్చుకోవాలి. ఆయన మార్గంలో పయనిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు. రామోజీరావుతో మాట్లాడి బయటకు వస్తే తెలియని శక్తి వచ్చేది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" – నిర్మాత సురేశ్‌బాబు

**గొప్ప వ్యక్తి మనకు దూరమైపోయారు** "ఒక మహానుభావుడిని మేం కోల్పోయాం. స్టూడియో కట్టేటప్పుడు కూడా మమ్మల్ని పిలిచి సలహాలు అడిగేవారు. అలాంటి గొప్ప వ్యక్తి మాకు దూరమైపోయారు. మయూరి డిస్ట్రిబ్యూషన్ ద్వారా చాలా సినిమాలు విడుదల చేశాం"– సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి

**రామోజీ ప్రజల మనిషి** "రామోజీరావుగారితో నాకు 43 ఏళ్ల అనుబంధం ఉంది. కలిసినప్పుడల్లా ఎన్నో మంచి విషయాలు పంచుకునేవారు. క్రమశిక్షణతో ఎలా ఉండాలో చెప్పేవారు. తాను ప్రజల మనిషినని, వారి కోసమే బతుకుతున్నానని చెప్పేవారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని తనవంతు ఏం చేయగలరో చెప్పేవారు. ఆయన మరణం తెలుగువారికి తీరనిలోటు. ఇలాంటి స్టూడియోను నిర్మించటం ఒక్కడి వల్ల కాదు. కానీ, ఆయన స్థాపించి చూపించారు" –మోహన్‌బాబు

**లక్షలాది కుటుంబాలకు అన్నం పెట్టారు..** "కీర్తిని మాత్రమే వదిలేసి రామోజీ స్వర్గస్తులయ్యారు. మనవల్ల, మనం స్థాపించిన సంస్థల వల్ల పది మందికి ఉపాధి కల్పించడమన్నది సామాన్యమైన విషయం కాదు. లక్షలాది కుటుంబాలకు ఆయన అన్నం పెట్టారు. ఆ కీర్తిని మించింది లేదు. ఆయన మేరు పర్వతం. కారణ జన్ముడు. రామోజీరావు గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన సంస్థలో ఐదు సినిమాలు, ఒక వెబ్‌సిరీస్ చేశా. ఆయన చూపిన బాటలో నడుస్తూ పది మందికి సాయపడటమే మనం చేయాల్సింది" – నటుడు శివాజీ

## రామోజీ రావు మృతిపట్ల కేసీఆర్ సంతాపం



హైదరాబాద్: ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీ రావు మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. పలు రంగాల్లో వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. శోకతప్తులైన రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రామోజీ రావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. స్వయం కృషితో ఎదిగిన గొప్ప దార్శనికుడని చెప్పారు. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. రామోజీ మృతి పట్ల సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సంతాపం తెలిపారు. సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం నేడు అందరికీ ఆదర్శమని చెప్పారు. తెలుగువాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటిచెప్పారని వెల్లడించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



# అక్షర యోధుడి అస్తమయం

హైదరాబాద్: ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు(88) కన్నుమూశారు. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. 1936 నవంబర్ 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు.

అక్కలు రాజ్యలక్ష్మి, రంగనాయకమ్మ తర్వాత ఆయన జన్మించారు. కుటుంబసభ్యులు రామోజీకి.. తాతయ్య రామయ్య పేరు పెట్టారు. బడిలో మాస్టారుకు తన పేరు రామోజీరావు అని చెప్పి.. తన పేరును తనే పెట్టుకున్నారు. చిన్నప్పటి నుంచే విలక్షణ, సృజనాత్మకత ఉన్న వ్యక్తి ఆయన. ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారు. ప్రారంభించిన నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారింది. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా 'సితార' సినీ పత్రిక నిలిచింది.

**కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం..** బహుముఖ ప్రజ్ఞ.. కఠోర సాధన.. ఇవే రామోజీ అస్త్రాలు. నలుగురు నడిచిన బాట కాదు.. కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారు. మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన రామోజీరావు.. చైతన్యదీప్తుల్లాంటి చిత్రరాజాలను సృజించారు. అద్భుత ఫిల్మ్‌సిటీని సృష్టించారు.

తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆఖరి క్షణం వరకూ ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించారు. పనిలోనే విశ్రాంతి అనేది ఆయన ప్రాథమిక సూత్రం. చివరి క్షణం వరకు పనిలోనే విశ్రాంతి సిద్ధాంతాన్ని పాటించిన మహనీయుడు.

**వేల మందికి ఉద్యోగ, ఉపాధి..** అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ ఆయన చెరగని ముద్ర వేశారు. 1962లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించారు. దేశంలోనే అగ్రశ్రేణి చిట్‌ఫండ్స్ సంస్థగా మార్గదర్శి నిలిచింది . 60 ఏళ్లలో లక్షలాదిమంది ఖాతాదారులకు నిబద్ధతతో సేవలు అందించారు. ఈ సంస్థ ద్వారా వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించారు.

## అధికారిక లాంఛనాలతో రామోజీ అంత్యక్రియలు: సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్: ఈనాడు అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తెలుగు పత్రికా, మీడియా రంగానికి రామోజీరావు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "రామోజీరావు మరణం చాలా బాధాకరం. పత్రికలు, ప్రసార మాధ్యమాల రంగంలో దేశానికే ఆయన ఆదర్శంగా నిలిచారు. పత్రికలు, ప్రసార సాధనాలు కూడా ప్రతిపక్ష పాత్ర పోషిస్తాయని నిరూపించారు. ప్రజా సమస్యలను లేవనెత్తి ప్రజలకు మేలు జరిగే విధంగా పోరాటం చేశారు. తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశానికే ఆయన మృతి తీరని లోటు" అని రేవంత్ అన్నారు. రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీడబ్ల్యూసీ సమావేశాల కోసం దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఏర్పాట్లు పర్యవేక్షించాల్సిందిగా రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ద్వారా ఆదేశించారు.

## తెలుగు జాతి ఉన్నంతకాలం రామోజీరావు గుర్తుంటారు: కేటీఆర్



హైదరాబాద్: తెలుగు పత్రికా రంగం, ప్రసార మాధ్యమాల్లో విప్లవాత్మక మార్పులకు బీజం వేసిన మహనీయుడు రామోజీరావు అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఫిల్మ్‌సిటీలో రామోజీరావు పార్థివదేహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ఈ నష్టం సామాన్యమైనది కాదన్నారు. రామోజీరావు మృతి తెలుగు పత్రికా రంగంతో పాటు ప్రపంచంలోని తెలుగువారందరికీ తీరని లోటు అని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. "విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీరావు గుర్తుగా నిలిచిపోతారు. ఈనాడు, ఈటీవీతో తనదైన ముద్ర వేశారు. ఎల్లవేళలా తెలుగు రాష్ట్రాలు, దేశం బాగుండాలని తపించేవారు. తెలుగు భాషను అభిమానించిన విధానం, తపన అందరికీ ఆదర్శం. ఎన్నో సందర్భాల్లో ఆయన్ను కలిసే అవకాశం దక్కింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తెలుగు వారి గురించి చెప్పేవారు. గతం గురించి చెప్పడంతో పాటు భవిష్యత్తు ఎలా ఉండాలనేదానిపై పలు సూచనలు చేసేవారు.

యూనివర్సల్ స్టూడియో స్థాయిలో ఫిల్మ్‌సిటీని నిర్మించాలనే సంకల్పం.. ఓ విజనరీకి మాత్రమే సాధ్యం. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా రామోజీరావు జ్ఞాపకాలు, ఆశయాలు, ఆలోచనలు తప్పకుండా భవిష్యత్తులో స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి. తెలుగు జాతి ఉన్నంతకాలం ఆయన గుర్తుంటారు" అని కేటీఆర్ అన్నారు.

## కేసీఆర్, జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు: ఎమ్మెల్యే వివేక్



తిరుమల: తెలుగు రాష్ట్రాల మాజీ సీఎంలపై చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కేసీఆర్, జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. అహంకారంతో విర్రవీగితే ప్రజలు ఇలాగే సమాధానం చెప్తారని ఘాటుగా స్పందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ.. తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోడీకి సైతం ఆదరణ తగ్గిందని, దానికి ఎన్డీయే కూటమి గెలుపొందని సీట్లే నిదర్శనమన్నారు ఎమ్మెల్యే వివేక్. లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఈడీ, సీబీఐలతో అభ్యర్థులను బెదిరించి గెలవాలని చూసిందని ఆరోపించారు. కానీ ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి లోక్ సభ, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీ వచ్చిందన్నారు. పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణ మంచి మెజారిటీతో గెలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అహంకార నేతలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు.

## చేప మందు కోసం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు పోటెత్తిన ప్రజలు..

హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం అయ్యింది. చేప మందు కోసం తెలుగు రాష్ట్రాలు సహా బిహార్, యూపీ, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివస్తున్నారు. వేలాదిమందితో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. మందు కోసం ఆస్తమా బాధితులు పెద్దఎత్తున వస్తున్నారు. క్యూలైన్‌లో ఉన్నవారికి నాలుగు గంటలకుపైగా సమయం పడుతోంది. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో నాంపల్లి పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. జూన్ 9 ఉదయం 11గంటల వరకు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. బత్తిని సోదరులు అందించే చేప ప్రసాదం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. అది తీసుకుంటే ఆస్తమా, ఉబ్బసం, శ్వాస సమస్యలు తొలగిపోతాయంటూ కొందరు విశ్వసిస్తారు. దీంతో ప్రతి సంవత్సరం రెండ్రోజులపాటు బత్తిని సోదరులు చేప మందు పంపిణీ చేస్తుంటారు. మృగశిర కార్తె తర్వాత మాత్రమే వారు చేప మందు ఇవ్వడం ప్రత్యేకం. బత్తిని సోదరుల ఇంట్లో ఉన్న బావి నీటిలో ఔషధ గుణాలు ఉంటాయని కొంతమంది విశ్వసిస్తారు. ఆ నీటితో ప్రసాదం తయారు చేయడంతో శ్వాస సంబంధిత బాధితులు ఎగబడుతున్నారు. మందును చేప పిల్లల నోట్లో కుక్కి.. దాన్ని బాధితుల గొంతులో వేస్తారు. దీంతో వారికి శ్వాస సంబంధిత వ్యాధులు తగ్గుతాయని బత్తిని సోదరులు చెప్తుంటారు. కానీ ఈ మందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. చేపమందు కోసం వచ్చే వారి కోసం టీజీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి నాంపల్లికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660